సాక్షి
పెద్దపల్లి
శనివారం । 26 । ఆగస్టు । 2023



'ధరణి'.. పరిష్కరించండి

ధరణి పోర్టల్ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. 8లో▸



డీపీవో ఆకస్మిక తనిఖీ

రామగిరి: మండలంలోని పన్నూర్‌లో శుక్రవారం డీపీవో చంద్రమౌళి పర్యటించారు. అభివృద్ధి పనులు, నూతన పంచాయతీ కార్యాలయం పనులను తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

ఆరైనా 'హస్తగతం' కావాలి!

- ఉమ్మడి జిల్లాలో సత్తా చాటేందుకు కాంగ్రెస్ వ్యూహం
- 13 స్థానాల్లో ఆరుచోట్ల విజయంపై ధీమా
- నెలాఖరున పార్టీలో చేరనున్న మాజీ ఎంపీ జి.వివేక్?
- గాంధీభవన్‌లో 40కిపైగా దరఖాస్తులు, గరిష్టంగా కరీంనగర్‌కు..
- పారిశ్రామికవేత్తల చేరికలతో పార్టీ బలోపేతంపై ధీమా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



కర్ణాటక ఎన్నికల ఫలితాలతో కొత్త ఉత్సాహంతో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఈసారి సానుకూల పవనాలు వీస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఇటీవల బీఆర్‌ఎస్ ప్రకటించిన దరిమిలా.. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వాతావరణం మొదలైంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా బరిలో నిలిచే అభ్యర్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎలాగైనా కనీసం ఆరు స్థానాలు సాధించాలన్న వ్యూహంతో మెరికల్లాంటి అభ్యర్థులను రంగంలోకి దింపే పనిలో ఉంది. ప్రభుత్వ వ్యతిరేకత, సీనియర్లపై సానుభూతి, కొత్తగా పార్టీలోకి చేరుతున్న నాయకగణం తదితర కారణాలు ఈసారి జిల్లాలో తమకు గౌరవప్రదమైన సంఖ్యలో ఎమ్మెల్యేలను గెలిపిస్తాయని అధిష్టానం బలంగా నమ్ముతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ స్థానాల్లో తమకు ఎంతలేదన్నా.. కనీసం ఆరేడుకు తగ్గకుండా గెలిచి తీరుతామన్న ధీమాతో కాంగ్రెస్ ముందుకెళ్తోంది.

ఈ స్థానాలు కీలకం..!

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు, థర్డ్ పార్టీ సర్వేల అనంతరం పెద్దపల్లి(విజయరమణారావు), మంథని(దుద్దిళ్ల శ్రీధర్ బాబు), రామగుండం(రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్), ధర్మపురి(అడ్లూరి లక్ష్మణ్), వేములవాడ(ఆది శ్రీనివాస్), హుస్నాబాద్(పొన్నం ప్రభాకర్),జగిత్యాల(జీవన్‌రెడ్డి) స్థానాల్లో తమ అభ్యర్థులు బలంగా ఉన్నారని, అధికార బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీ ఇస్తారని కాంగ్రెస్ ధీమాగా ఉంది. చొప్పదండి(మేడిపల్లి సత్యం), మానకొండూరు(కవ్వంపల్లి సత్యనారాయణ), సిరిసిల్ల (కేకే మహేందర్ రెడ్డి), కోరుట్ల(జువ్వాడి నర్సింగరావు) కూడా ఈసారి తమకు స్థానికంగా సానుకూల పరిస్థితులు ఉన్నాయని నమ్ముతున్నారు. హుజూరాబాద్ నుంచి మరోసారి బల్మూరి వెంకట్ బరిలోకి దిగనున్నారన్న ప్రచారం నడుస్తోంది. అన్నింటికంటే చివరిగా కరీంనగర్ స్థానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానానికి పార్టీలో తీవ్రపోటీ నెలకొంది. మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు మేనేని రోహిత్, పొన్నం ప్రభాకర్ మధ్య పోటీ ఉన్నా.. పొన్నం హుస్నాబాద్‌కు వలస వెళ్లడంతో రోహిత్‌కు దాదాపుగా రూట్ క్లియర్ అయింది. అదేసమయంలో మైత్రీ గ్రూప్స్ అధినేత కొత్త జయపాల్‌రెడ్డి పార్టీలో చేరడంతో మరో ఆశావహుడు పెరిగినట్లయింది. దరఖాస్తుల పరంగా చూసినా.. కరీంనగర్‌కు ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది, తర్వాత స్థానంలో కోరుట్లకు పోటీ ఉంది.

కాంగ్రెస్ గూటికి మాజీ ఎంపీ వివేక్!?

పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి మరోసారి పార్టీ మారనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఈనెల 30వ తేదీ తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. కేంద్ర మాజీమంత్రి జి.వెంకటస్వామి రాజకీయ వారసుడిగా 2009లో పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. 2014లో కాంగ్రెస్ నుంచి ఓడాక బీఆర్‌ఎస్‌లో చేరి ప్రభుత్వ సలహాదారుగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమి కోసం ప్రయత్నించారన్న విమర్శలతో పార్టీ ఆయనను పక్కనబెట్టింది. అప్పటినుంచి ఆయన బీజేపీలో కొనసాగుతున్నారు. ఐదేళ్లుగా జాతీయ పార్టీలో పనిచేసినా సరైన ప్రాధాన్యం దక్కలేదన్న ఆవేదనతో తిరిగి మాతృపార్టీ కాంగ్రెస్‌కు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



మాజీ ఎంపీ వివేక్

ఈ క్రమంలోనే పార్టీలో హస్తం పార్టీ నుంచి ఆయనకు గ్రీన్‌సిగ్నల్ వచ్చిందని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి సీటు ఇస్తామన్న హామీతో ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిసింది. అంగబలం, అర్థబలం దండిగా ఉన్న వివేక్ పార్టీలో చేరితే.. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అన్నిస్థానాల అభ్యర్థులకు అండగా నిలుస్తారని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

దరఖాస్తులు ఇలా

కరీంనగర్: 1.కొనగాల మహేశ్, 2.కర్ర సత్య ప్రసన్నరెడ్డి, 3.సమద్‌నవాబ్, 4.రేగులపాటి రమ్యరావు, 5.కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, 6.వైద్యుల అంజన్‌కుమార్, 7.మేనేని రోహిత్‌రావు, 8.రహమత్ హుస్సేన్, 9.పాడాల రాహుల్, 10.కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, 11.కొత్త జైపాల్‌రెడ్డి

హుజూరాబాద్: 1.బల్మూరి వెంకట్, 2. పత్తి కృష్ణారెడ్డి, 3. దాసరి భూమయ్య , 4. సాయిని రవి

మానకొండూరు: 1. కవ్వంపల్లి సత్యనారాయణ

చొప్పదండి: 1. వెన్న రాజ మల్లయ్య, 2. బండ శకుంతల, 3. నాగి శేఖర్

హుస్నాబాద్: పొన్నం ప్రభాకర్

జగిత్యాల: 1.తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ధర్మపురి: 1.గజ్జల స్వామి, 2. మద్దెల రవీందర్, 3.బండారి కనుకయ్య, 4. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, 5.వడ్లూరి కృష్ణ, 6. బొల్లి స్వామి

కోరుట్ల: 1. జువ్వాడి నరసింగరావు, 2. కొమిరెడ్డి జ్యోతక్క, 3. కల్వకుంట్ల సుజిత్ రావు, 4. కోమిరెడ్డి కరంచంద్, 5. కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, 6. మహమ్మద్ షాకీర్, 7. సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

పెద్దపల్లి: 1. చింతకుంట విజయరమణారావు, 2. గంట రాములు యాదవ్, 3. ఈర్ల కొమురయ్య

మంథని: 1.దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, 2.ప్రమోద్‌కుమార్

రామగుండం: 1. ఎంఎస్ రాజ్ ఠాకూర్, 2. జనక్ ప్రసాద్, 3. రియాజ్ అహ్మద్, 4. వెంచర్ల మహేశ్

సిరిసిల్ల: 01. కే.కే మహేందర్ రెడ్డి, 02. చీటీ ఉమేశ్ రావు, 03. సంగీతం శ్రీనివాస్, 04. నాగుల సత్యనారాయణ గౌడ్

వేములవాడ: 1. ముడిక చంద్రశేఖర్, 2. తొట్ల అంజయ్య, 3. సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

న్యూస్‌రీల్

కుర్సుకం భూములకు పట్టాలివ్వించండి



సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): అంతర్గాం మండలం పెద్దంపేట్, రాయదండిలో చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కుర్సుకం భూములకు సంబంధించి రైతులకు పట్టాలిప్పించాలని సీఎం కేసీఆర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. శుక్రవారం సచివాలయంలో సీఎంను కలిసి పలు సమస్యలు విన్నవించారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు అంతర్గాంలో 102 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు, పాలకుర్తి మండలంలో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని కోరారు. పుట్నూర్ వ్యవసాయ మార్కెట్‌కు నిధులు మంజూరు చేయాలని కోరగా, సమస్యలను సావధానంగా విన్న సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈసందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి వెంటనే స్పందించిన సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల పనుల్లో వేగం పెంచండి



అప్పన్నపేటలో పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: మన ఊరు– మన బడి పనుల్లో వేగం పెంచాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను శుక్రవారం పర్యవేక్షించారు. పంచాయతీరాజ్ ఏఈ మదన్‌మోహన్‌ను పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంట నాయకులు చీకటి పోచాలు తదితరులున్నారు.

ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకుందాం



స్వాగతం పలుకుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు సాగిద్దామని ఏఐటీయూసీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లికి వచ్చిన సందర్భంగా సీపీఐ నాయకులు, సెకండ్ ఏఎన్‌ఎంలు స్వాగతం పలికారు. పీఎం మోదీ, సీఎం కేసీఆర్‌లు నియంత పాలనను సాగిస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల పట్ల అమలు చేస్తున్న నిరంకుశ చట్టాలను ప్రతిఘటించాలన్నారు. నాయకులు సదానందం, సునీల్, రమేశ్, స్వామి, రవి, మల్లారెడ్డి, స్వరూప, మమత, రాణి, రమేశ్, సరోజ, లావణ్య, పద్మ, రమాదేవి, ఫాతిమా, తిరుపతి పాల్గొన్నారు.

'హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం'



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన నాయకులు

పెద్దపల్లిరూరల్: ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్‌రెడ్డి, పర్వతాలు ఆరోపించారు. శుక్రవారం కలెక్టర్ ముట్టడికి యత్నించిన బీజేపీ నాయకులు ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్ల కాలంగా తెలంగాణలో మోసపూరిత పాలన సాగుతోందని ఆరోపించారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులకు రేషన్‌కార్డులివ్వాలన్నారు. నాయకులు మల్లికార్జున్, కృష్ణ, శ్రీనివాస్, రాజన్న, నాగరాజు, శ్రీకాంత్, ప్రభాకర్, సోడాబాబు, రాకేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ పోలీస్ బాధ్యత

- ఏసీపీ మహేశ్



ఏసీపీ, సీఐలకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మహిళల రక్షణ పోలీసుల బాధ్యత అని ఏసీపీ ఎడ్ల మహేశ్ అన్నారు. సీపీ రెమారాజేశ్వరి ఆలోచన మేరకు సుల్తానాబాద్ పట్టణంలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో మహిళల భద్రత– పోలీసుల బాధ్యత కార్యక్రమంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులకు గురవుతున్న మహిళల రక్షణకు ఉమెన్ సేఫ్టీ, షీ టీం, హాక్ ఐ, అభయ యాప్‌లు పని చేస్తున్నాయని వివరించారు. తాత్కాలిక ఆనందం కోసం ప్రలోభాలకు, ఆకర్షణకు గురై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను అలవర్చుకొని ఉన్నతస్థాయిలో రాణించినప్పుడు గురువులకు, తల్లిదండ్రులకు సంతోషం ఉంటుందని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం పెరగడంతో ఆన్‌లైన్ మోసాలు పెరిగాయని, వీటి పట్ల తల్లిదండ్రులను అలర్ట్ చేయాలని సూచించారు. అలాగే రాఖీ పండుగను పురస్కరించుకొని పోలీసులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో సీఐ జగదీశ్, సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్ రహీం, ఎస్సైలు విజేందర్, శ్రీనివాస్, వెంకటకృష్ణ, అశ్విని, షీటీం ఎస్సై రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగారంను సందర్శించిన జెడ్పీ సీఈఓ

మంథని: మంథని మండలంలోని నాగారం గ్రామ పంచాయతీని శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ శ్రీనివాస్ సందర్శించారు. ఈసందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల్లో భాగంగా చేపట్టిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పారిశుధ్య పనులు పరిశీలించారు. రైతు వేదిక భవనంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట సర్పంచ్ బూడిద మల్లేష్, ఎంపీడీఓ రమేష్ తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా ఏఐటీయూసీ మహాసభలు



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



అభివాదం చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

- ప్రారంభోత్సవానికి తరలివచ్చిన నాయకులు, కార్మికులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మహాసభలు శుక్రవారం గోదావరిఖనిలో భారీ ఊరేగింపుతో ఘనంగా ప్రారంభమయ్యాయి. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాలకు చెందిన నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఎర్ర షర్టులు ధరించిన వాలంటీర్లు, యూనియన్ అగ్రనాయకులు ముందునడవగా వారి వెనుక బ్యానర్లు, ఎర్రజెండాలతో కార్మికుల ప్రదర్శన కొనసాగింది. స్థానిక జీఎం గ్రౌండ్ నుంచి ప్రారంభమై ప్రధాన చౌరస్తాకు చేరుకుంది. ర్యాలీలో సీపీఐ నాయకులు కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి సీతా రామయ్య తదితరులు పాల్గొన్నారు. మహాసభలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి.

విష జ్వరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలి

రామగిరి(మంథని): విషజ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. కొద్దిరోజులుగా మండలంలోని బేగంపేట్‌లో విషజ్వరాలు, డెంగీ లక్షణాలతో పలువురు బాధపడుతుండగా శుక్రవారం గ్రామంలో పర్యటించారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరినవారి వివరాలు తెలియడం లేదని, నిర్లక్ష్యం చేయకుండా సరైన సమయంలో చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో జ్వరాలపై సర్వే నడుస్తుందని వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు ఇంటింటా వివరాలు సేకరిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మలేరియా అసిస్టెంట్ ఆఫీసర్ ఉమామహేశ్వర్‌రావు, మండల వైద్యాధికారి ప్రదీప్, హెచ్‌ఈవో సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న ప్రమోద్‌కుమార్

రెండు లారీలు ఢీ.. చెలరేగిన మంటలు



మంటల్లో కాలిపోతున్న లారీలు



లారీలోనే సజీవ దహనమైన డ్రైవర్ ఫర్వీద్

- లారీలోనే సజీవ దహనమైన డ్రైవర్.. తీవ్రగాయాలతో బయటపడ్డ క్లీనర్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగాయి. మంటల్లో డ్రైవర్ సజీవ దహనం కాగా క్లీనర్ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఎస్సై విజేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హరియానా రాష్ట్రం పాల్వల్ జిల్లా, హతిని తాలుకాకు చెందిన అన్నదమ్ములు ఫర్వీద్(25), ఇంజిమామ్ లారీ డ్రైవర్, క్లీనర్‌గా ఏలూరులో పని చేస్తున్నారు. ఏలూరు నుంచి ఏపీ 37టీఈ 5831 లారీలో టైల్స్ లోడ్ చేసుకొని మంచిర్యాలకు బయలుదేరారు. ఈక్రమంలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి పరిధిలో ఏపీ 29 టీబీ2382 నంబర్ గల లారీ రాజీవ్ రహదారి పక్కనే ఉన్న మారుతి రైస్‌మిల్ నుంచి ధాన్యం లోడ్‌తో రోడ్డుపైకి వస్తున్న క్రమంలో టైల్స్ లోడ్‌తో ఉన్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న ఫర్వీద్ మంటల్లోనే సజీవ దహనం కాగా, క్లీనర్ ప్రమాదాన్ని గుర్తించి కిందకు దూకి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈప్రమాదంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఘటన స్థలానికి ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐ జగదీశ్‌లు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తీవ్రంగా గాయపడిన ఇంజిమామ్









రావమ్మా మహాలక్ష్మీ

పెద్దపల్లిరూరల్: రావమ్మా మహాలక్ష్మీ అంటూ మహిళలు ఆలయాల్లో నిజశ్రావణ తొలి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆడపడుచులు వరలక్ష్మీ వ్రతాలను నోముకున్నారు. పెద్దపల్లి పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో మంగళహారతులిచ్చి పూజలు చేశారు. ముత్తైదువులకు వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతం ఆచరించిన వారంతా తాంబూలం, ఆకువక్క, పసుపుకుంకుమ ఇచ్చుకున్నారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన 'పుట్ట' దంపతులు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శైలజ

మంథని: జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు–శైలజ దంపతులు శుక్రవారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత అభివృద్ధిపై చర్చించేందుకు పర్సనల్‌గా కలవాలని పుట్ట మధుకు సీఎం సూచించడంతో వరుసగా రెండు రోజులు భేటీ అయ్యారు. నియోజవర్గ అభివృద్ధికి ఇచ్చిన ప్రతిపాదనలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు మధు తెలిపారు.

అభివృద్ధికి కేరాఫ్ తెలంగాణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపిన సీఎం కేసీఆర్ సారథ్యంలోని పాలనను ప్రజలంతా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపెల్లి శివారు రంగంపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి సమావేశంలో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడోసారి సీఎం కేసీఆర్‌కే అధికారం అప్పగించేలా ప్రజలంతా నిర్ణయం తీసుకున్నారని వివరించారు. ఇందుకోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గంలోనూ ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించడంతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరును వివరించాలన్నారు. ప్రతి 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఆ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దని అన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలు'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): వివిధ రంగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మహిళా కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇ.నరేశ్ ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో కార్మికులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కస్తూరిబా పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ స్పందించి మహిళా కార్మికులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్, రాంకి, మల్లేశం, రజిత, పల్లవి, రాజలక్ష్మి, శ్యామల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక, ధరణి పోర్టల్ దరఖాస్తుల పరిష్కారం, ఇంటి పట్టాల పంపిణీ తదితర అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షించారు. పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, ధరణిలో జీఎల్ఎం, టీఎం 33 మాడ్యుల్ దరఖాస్తులు త్వరగా విచారణ చేపట్టి కలెక్టర్ పోర్టల్‌కు పంపాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద జిల్లాలో 33,816 దరఖాస్తులు అందగా, ఇప్పటి వరకు 33,577 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని వివరించారు. ఆర్డీవోలు మధుమోహన్, వి.హనుమానాయక్, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

జిల్లాలో 18 ఏళ్లు నిండినవారంతా (1అక్టోబర్ 2023 నాటికి) తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఈనెల 26, 27, సెప్టెంబర్ 2,3వ తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నోడల్ అధికారిగా రవుఫ్‌ఖాన్

జిల్లాలో ఓటరు అవగాహన కార్యక్రమాల నిర్వహణ అధికారిగా రవుఫ్‌ఖాన్‌ను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 97 మంది సెక్టార్ అధికారులను నియమించి శిక్షణ నిచ్చారు. ఎన్నికల్లో విధులు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్య సాధనకు కృషిచేయాలి



సమీక్షలో జీఎం రవికుమార్, అధికారులు

రామగిరి(మంథని): బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి నిర్దేశించిన లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ జీఎం రవికుమార్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కావల్సిన యంత్రాలు, ఇతర పరికరాలపై ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు నాణ్యత, ఉత్పత్తిని సాధించేందుకు ఉపరితల గనులకు అవసరమయ్యే యంత్రాలు, సామగ్రి, ఎలక్ట్రికల్ మిషనరీ పనిముట్లు, యంత్రాలకు కావల్సిన విడిభాగాల గురించి చర్చించారు. సమావేశంలో అధికారులు ఎలీషా, రఘుపతి, రాధాకృష్ణ, రాజేందర్, రమేష్, కె.చంద్రశేఖర్, కాశీవిశ్వేశర్‌రావు, పద్మరాజు, కమిటీ సభ్యులు చక్రవర్తి, రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పార్థివ శరీరాలను దానం చేయాలి



నేత్రదానం అంగీకార పత్రం అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

ఓదెల(పెద్దపల్లి): తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేస్తున్న మెడికల్ కళాశాలలకు అవసరమయ్యే పార్థివ శరీరాలను దానం చేయాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. శుక్రవారం ఓదెలలో నిర్వహించిన 38వ జాతీయ నేత్రదానం పక్షోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మనుషులు మృతిచెందిన తరువాత అవయవ దానం చేస్తే పిల్లలు, కుటుంబానికి గౌరవం వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ నేత్ర, అవయవ దానం చేయాలన్నారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. నేత్రదానంపై ప్రజలను చైతన్యపరచాలని పేర్కొన్నారు. కాగా ఓదెల గ్రామస్తులందరూ నేత్ర దానానికి అంగీకరించి తీర్మానం చేయడంపై అభినందించారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి మాట్లాడుతూ, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్రదానంపై ప్రభుత్వం స్పందించి దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఓదెలలో 150 మంది నేత్ర దానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, సర్పంచ్ ఆకుల మహేందర్, ఉప సర్పంచు తీర్థాల కుమార్, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో సత్తయ్య, ఫౌండేషన్ ప్రతినిధి శ్రవణ్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మీడియా ప్రతినిధి వాసు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదప్రజలకు న్యాయం



మాట్లాడుతున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని:(రామగుండం): కాంగ్రెస్ పార్టీతోనే పేదప్రజలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రాక్టర్స్, డ్రైవర్స్ అండ్ లేబర్స్ అసోసియేషన్ సభ్యులు, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఉమ్మెంతుల దేవేందర్‌రెడ్డి, మేకల పోశంయాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, గట్ల రమేష్, మారెల్లి రాజిరెడ్డి, చుక్కల శ్రీనివాస్, శంకర్, ధూళికట్ట సతీశ్, ట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఎల్ఏ పాత్ర కీలకం

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు బూత్‌లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏ)పాత్ర కీలకమని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ అన్నారు. శుక్రవారం స్థానిక దుర్గానగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఎల్ఏల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి బూత్‌లో తప్పుడు ఓటర్లను గుర్తించి వారిని తొలగించేలా, క్రొత్త ఓటర్లను చేర్పించేలా కృషి చేయాలన్నారు. టీపీసీసీ సీనియర్ సెక్రటరీ నిరంజన్, రాష్ట్ర ఎలక్షన్ కమిటీ మెంబర్ శశిభూషణ్‌కాచే, పీసీసీ జనరల్ సెక్రెటరీ సొమ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తికి పూర్వ వైభవం

- కల్లుగీత కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రవికుమార్‌గౌడ్



మాట్లాడుతున్న రవికుమార్‌గౌడ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): గీత కార్మికులకు పూర్వ వైభవాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తుందని కల్లు గీత పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఓదెల మండల కేంద్రంలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు వెళ్తూ.. సుల్తానాబాద్ మండల కేంద్రంలో మాట్లాడారు. గీతకార్మికులకు త్వరలో సేఫ్టీ మోకులను ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. నీరాకేఫ్‌లను నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గీత కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి చెప్పేందుకు సెప్టెంబర్ రెండోవారంలో హైదరాబాద్‌లో గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్ర గౌడ్, మొలుగురి అంజయ్యగౌడ్, ముత్యం రమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కొలిపాక జన్మదిన వేడుకలు



పుట్టినరోజు సంబరాల్లో కొలిపాక శ్రీనివాస్ తదితరులు

పెద్దపల్లిరూరల్: బీసీ సంక్షేమ సంఘం నాయకుడు, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలను శుక్రవారం జెండాకూడలిలో అభిమానులు, ముదిరాజ్ సంఘ నాయకుల సమక్షంలో జరుపుకున్నారు. శ్రీనివాస్ మద్దతుదారులు, ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీనివాస్‌ను శాలువా, పూలమాలలు, గజమాలతో సత్కరించారు. మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నరసయ్య, చిరంజీవితో పాటు నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల నుంచి తరలివచ్చిన యువకులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో వ్యక్తి మృతి



మల్లేశం (ఫైల్)

ధర్మారం: మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన వడుకాపురం మల్లేశం (45) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం రాత్రి అతను అస్వస్థతకు గురికాగా వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

లక్కీడ్రాలో లక్ష్మీ ప్రతిమను గెలుచుకున్న మహిళ



బంగారు ప్రతిమను అందిస్తున్న లావణ్య

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక ఆర్టీసీ బస్‌డిపో సమీపంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ నిర్వహించిన లక్కీడ్రాలో స్థానిక మహిళ ఒక్కగ్రామ్ బంగారు లక్ష్మీదేవి ప్రతిమ గెలుచుకున్నారు. అమ్మవారి బంగారు ప్రతిమను బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్యఅరుణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

కాషాయ జెండా ఎగరేస్తాం



రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లిల్ల కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలో ఏలవేని తిరుపతియాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, రాష్ట్రంలో అవినీతి, అక్రమాలతో పాటు కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కొమ్ము తిరుపతియాదవ్, సొదరి మహేందర్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ పిన్నింటి రాజు, మండల, పట్టణ అధ్యక్షులు కదారి అశోక్ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరిద్దాం

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలును ప్రజలకు వివరిస్తూ మద్దతు కూడగట్టాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు సమ్మయ్య, కాసర్ల జనార్దన్‌రెడి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పాలి



బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ శ్రేణులు

మంథని: మంథని నియోజకవర్గ ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులకు సరైన గుణపాఠం చెప్పేలా ఇక్కడి ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆలోచించి ఓటువేయాలని అస్సాం రాష్ట్ర థౌర ఎమ్మెల్యే సుకాంత్ కోరారు. ప్రవాసి ఎమ్మెల్యే సంపర్క్ అభియాన్‌లో బాగంగా శుక్రవారం మంథనిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ అద్భుతమైన అభివృద్ధి చేస్తున్నారన్నారు. మంథని నియోజకవర్గాన్ని నలభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ వందల కోట్లు లూటీ చేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న జెడ్పీ చైర్మన్ అవినీతి, అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. లక్షలాది రూపాయల వేతనం వదులుకొని ప్రజా సేవ కోసం వచ్చిన చంద్రుపట్ల సునీల్‌రెడ్డిని ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్ రావు, కో కన్వీనర్ నాంపల్లి రమేష్, అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతికుమార్, నాయకులు ఎడ్ల సదాశివ్, చిలువేరు సతీష్, తోట మధుకర్ తదితరులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

విజిలెన్స్ వారోత్సవాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

రామగిరి(మంథని): ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయం ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజా ప్రయోజనాలు, సమాచారం ఇచ్చే వారి రక్షణ తీర్మానంపై ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు సింగరేణిలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవినీతి అంతమే సంస్థ ధ్యేయమని, అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐఅండ్‌పీఎం జీఎం రవికుమార్, ఏరియా ఇంజినీర్ ఏలీషా, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, డీవైపీఎం రవీందర్, డిప్యూటీ డీవైపీఎం శ్రీహరి, మారుతి, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వండి

- ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ



గనిలోకి దిగేందుకు వెళ్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం రామగుండం డివిజన్–2 పరిధి వకీల్‌పల్లిగనిని సందర్శించారు. సర్వే మ్యాప్ ద్వారా పని స్థలాలను పరిశీలించి గనిలో త్రీసీమ్ టాప్ సెక్షన్‌లో నడుస్తున్న కంటిన్యూస్‌మైనర్, ఫోర్‌సీమ్‌లో నడుస్తున్న ఎల్‌హెచ్‌డీ యంత్రాల పనితీరును మ్యాప్ ద్వారా పరిశీలించారు. వార్షిక బొగ్గు లక్ష్యాలు, ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలుతెలుసుకున్నారు. అనంతరం గనిలోకి దిగి త్రీసీమ్ టాప్ సెక్షన్‌లో నడుస్తున్న కంటిన్యూస్ మైనర్ పని స్థలాలను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీవైఎస్ఎస్ఓ అఫ్సర్‌పాషా, సర్వే అధికారి రహ్మద్‌అలీ, సంక్షేమాధికారి ఓంకారిబాబు తదితరులున్నారు. మొదటిసారిగా గనిపైకి వచ్చిన జీఎంను శాలువాతో సన్మానించారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి క్వార్టర్ల కౌన్సెలింగ్‌ను శుక్రవారం ఆర్జీ–2 ఏరియా సీఇఆర్ క్లబ్‌లో నిర్వహించారు. చేంజ్‌ఆఫ్ క్వార్టర్స్, క్వార్టర్లు లేని వారికి ఫ్రెష్ క్వార్టర్ల కౌన్సెలింగ్ చేపట్టారు. 574 క్వార్టర్లకు గాను 148 మంది హాజరు కాగా, 42 మందికి క్వార్టర్లు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌నలీం, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, ఈఈ ప్రతాప గిరిరాజు, సీనియర్ పీఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

'రాజకీయ జోక్యం సంస్థ మనుగడకే ముప్పు'



వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

రామగిరి(మంథని): కార్మికుల కష్టార్జితంతో సింగరేణికి వస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం తరలించుకపోతుందని, రాజకీయ జోక్యం వల్ల సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం నెలకొందని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. శుక్రవారం ఏపీఏ గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాజకీయ జోక్యంతో కోట్లాది రూపాయల నిధుల మళ్లింపు ఆర్థికపరమైన కుంభకోణాలు జరుగుతున్నయన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు గనిలో పలు సమస్యలపై మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్‌గౌడ్, మాదాసు రవీందర్, రమేష్, సురేష్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. క్వార్టర్ల మెయింటనెన్స్, రూఫ్ లీకేజీలు, సైడ్ డ్రైనేజీలు, వీధిదీపాలు, అంతర్గత రోడ్లు, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. భూగర్భగనుల్లో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్య భద్రతకు మ్యాన్‌రైడింగ్ విధానం కొనసాగుతుండగా, సరైన పనిముట్లు లేక నిలిచిపోతోందన్నారు. ఆయన వెంట నాయకులు ఆకుల హరీష్, సాయవేన సతీష్, బండారి శ్యాంసుందర్, చెన్నూరి రమేష్, అనిల్‌కుమార్ ఉన్నారు.

పారదర్శక పనితీరుకు ప్రతీక సింగరేణి విజిలెన్స్

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



పోస్టర్ విడుదల చేస్తున్న జీఎం, తదితరులు

గోదావరిఖని(రామగుండం): పారదర్శక పనితీరుకు ప్రతీకగా సింగరేణి విజిలెన్స్ నిలుస్తోందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయం ఆవరణలో విజిలెన్స్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థలో ఎక్కడైనా ఏ చిన్న అవినీతి జరిగితే సదరు సమాచారాన్ని విజిలెన్స్‌కు ఎలా ఫిర్యాదు చేయాలన్న వివరాలతో కూడిన వాల్‌పోస్టర్ విడుదల చేయడం జరిగిందన్నారు. అవినీతి జరిగినప్పుడు విజిలెన్స్‌కు ఎలా ఫిర్యాదు చేయాలో ప్రతీ ఉద్యోగికి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీ నారాయణ, ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, ఎస్టేట్ మేనేజర్ బాల సుబ్రహ్మణ్యం, సర్వే అధికారి ప్రభాకర్, డీజీఎం ఫైనాన్స్ ఎస్.ధనలక్ష్మి, పర్చేస్ అధికారి శ్రీనివాస్, సీనియర్ లా ఆఫీసర్ అఫ్రీనసుల్తానా, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ పీవో సారంగపాణి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



త్రీడీ చంద్రయాన్‌తో అభినందనలు

మంథని: మంథనికి చెందిన అంతర్జాతీయ త్రీడీ కళాకారుడు సింగారపు శివరామకృష్ణ చంద్రయాన్–3ని త్రీడీలో చిత్రీకరించి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారతీయులు గర్వపడేలా చంద్రయాన్–3 విజయవంతమైందన్నారు.